క్లుప్తంగా

సంబరంగా హోలీ వేడుకలు



హోలీ వేడుకలను జరుపుకుంటున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

మక్కువ: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ వేడుకలను యువత ఘనంగా జరుపుకున్నారు. యువత కేరింతలు, డ్యాన్సులు వేస్తూ, ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. స్థానిక సీఆర్పీఎఫ్ 198ఎఫ్ బెటాలియన్‌లో సీఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది కేక్‌కట్ చేసి హోలీ పండగను వైభవంగా జరుపుకున్నారు.

ఘనంగా దుర్గాదేవి ధ్వజస్తంభం ప్రతిష్టాపన



దుర్గాదేవి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శ్రీ విజయ దుర్గాదేవి పూర్ణకలశ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం గ్రామంలో భవానీ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముదరక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దుర్గాదేవిని భక్తులు గ్రామంలో ఊరేగించారు. అలాగే శని, ఆదివారాలు దేవీ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కర్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఇది బార్ కాదు..!



విద్యుత్ శాఖ కార్యాయంలో తాగి పడేసిన మద్యం సీసాలు

పార్వతీపురంటౌన్: ఈ చిత్రంలో కనిపిస్తున్నవి బార్ వద్ద పడేసిన వ్యర్థాలు అనుకుంటే పొరపాటు పడినట్లే..పార్వతీపురం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆకతాయిలు తాగిపడేసిన మద్యం సీసాలు. ప్రతిరోజూ సాయంత్రం సమయంలో విద్యుత్ శాఖ కార్యాలయం ముందు బాబులకు అడ్డాగా మారిపోయిందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వచ్చిన వారు సైతం మద్యం సీసాలు చూసి ఇదేం వని అని ముక్కున వేలేసుకుంటున్నారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి పట్టణంలోని వివేక్ ట్యూషన్ సెంటర్‌లో 35 మంది పదో తరగతి విద్యార్థులకు ప్లాంక్స్, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్ తదితర పరీక్షలకు ఉపయోగపడే సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతి నెల తన జీతంలో కొంత మొత్తాన్ని ఏదో ఒక సేవా కార్యక్రమానికి వినియోగిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఈ నెల 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేసి తన సేవాతత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మహంతి శ్రీనివాసరావు, నరసింహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న సాలూరు..!

- మంత్రి ఇలాకాలోని మున్సిపాలిటీలో పడకేసిన పాలన
- సమ్మెబాట పట్టిన మున్సిపల్ కార్మికులు
- మున్సిపల్ కమిషనర్ తీరుతో విసుగెత్తి డీఈఈకి బాధ్యతలు?





మున్సిపాలిటీలోని కొంకివీధిలో పేరుకుపోయిన చెత్త (ఇన్‌సెట్లో) మేదరవీధిలో తవ్వేసి వదిలేసిన కాలువ

సాలూరు: ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన, మున్సిపల్ కమిషనర్, అధికారుల నిర్లక్ష్య వైఖరి, జీతాల కోసం సమ్మెబాట పట్టిన కాంట్రాక్ట్ కారికులు..వెరశి మంత్రి సంధ్యారాణి ఇలాకాలోని సాలూరు మున్సిపాలిటీ దుర్గంధం వెదజల్లుతోంది. స్వచ్ఛపార్వతీపురం అంటూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అధికారులు బ్రహ్మాండంగా అక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే సాలూరు పట్టణంలో మాత్రం పేరుకుపోతున్న చెత్త..సమర్థుడైన కమిషనర్ లేక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పాలన అటకెక్కింది. ఫలితంగా పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమ్మెబాటలో కాంట్రాక్ట్ కార్మికులు

జీతాల చెల్లింపులు లేక బాకీలు ఉండడంతో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు స్థానిక మంత్రి సంధ్యారాణిని, పాలకవర్గాన్ని, అధికారులను కలిసినా సమస్యలు పరిష్కరిస్తామని హామీ మాటలే తప్ప అమలు కాని పరిస్థితి. దీంతో చేసేది లేక కార్మికులు మెరుపు సమ్మె చేపట్టారు. జీతాలు లేక కార్మికులు పెడుతున్న ఆకలికేకలకు గుర్తించిన పలు సంఘాలు వారికి మద్దతు తెలిపాయి. పలువురు అధికారులు, పాలకవర్గం సమ్మె విరమించాలని, మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా గత అనుభవాలను గుర్తుంచుకున్న కార్మికులు వారి మాటల ను నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో 5 రోజుల నుంచి సమ్మె కొనసాగుతోంది. ఫలితంగా మున్సిపాలిటీలోని వార్డుల్లో చెత్త పేరుకుపోతోంది. చెత్త నుంచి వస్తున్న దుర్గంధంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పేరుకుపోతున్న చెత్త ఫలితంగా దోమలు,ఈగలు అధికమవతుతున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం కనిపిస్తోంది.



5వ రోజు సమ్మెచేస్తున్న మున్సిపల్ కార్మికులు

మాటలు అలా..పాలన ఇలా..

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న నేటి పాలకులు మున్సిపాలిటీలో కనీసం పారిశుద్ధ్య పనులు చేయించలేని దుస్థితి నెలకొందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా స్థానిక మంత్రి, అధికారులు స్పందించాల్సి ఉంది. దాదాపు 15 ఏళ్ల తరువాత త్వరలో జరుగుతున్న శ్యామలాంబ పండగ సమీపిస్తున్న వేళ మున్సిపాలిటీలో తీరు ఈ విధంగానే ఉంటే లక్షల్లో వచ్చే భక్తులు మరెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో నేటి పాలకులు, అధికారుల ఊహకే వదిలేద్దాం.

అనారోగ్యంతో కమిషనర్ ఇబ్బందులు

కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన సత్యనారాయణ అనారోగ్యం, పలు కారణాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆయన మున్సిపాలిటీపై పట్టుసాధించే పరిస్థితి కూసింత కూడా లేదు. మున్సిపల్ సిబ్బంది కూడా ఎవరు ఎప్పుడు వస్తారో ఎప్పుడు రారో వారికే తెలియని పరిస్థితి, సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడం వంటి సంఘటనలను నేటి పాలకులు,అధికారులు గుర్తించిన సందర్భాలు ఉన్నాయి. ఎవరెన్ని హెచ్చరికలు, ఆదేశాలు జారీచేసినా నిమ్మకు నీరెత్తనట్లు మున్సిపల్ కార్యాలయంలో పలువురు ఉద్యోగుల తీరు ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో దాదాపు అన్ని విభాగాల్లోను మున్సిపాలిటీలో పాలన పడకేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మున్సిపాలిటీ అధికారుల తీరుతో జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాగా మున్సిపల్ కమిషనర్ తీరుతో విసిగిపోయిన జిల్లా అధికారులు కమిషనర్‌గా సత్యనారాయణను తప్పిస్తూ మున్సిపల్ డీఈఈ వరప్రసాద్‌కు భాధ్యతలు అప్పగించాలని ఆదేశాలు జారిచేసినట్లు తెలియవస్తోంది. ఇకనైనా పాలన గాడిన పడుతుందడా? అని పట్టణ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తిరుగుబాటు మొదలు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం పట్ల మొద్దు నిద్రలో ఉన్న పాలకుల కళ్లు తెరిపించేలా ప్రజా తిరుగుబాటు మొదలైందని, కూటమి సర్కార్ గుండెల్లో దడ పుడుతోందన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువతను ప్రభుత్వం గాలికొదిలేసింది. పేదరికంతో విద్యార్థులు చదువులకు దూరమైపోతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోంది. నిరుద్యోగ భృతి పేరుతో నెలకు రూ. 3 వేలు చెల్లిస్తామని చెప్పి యువత ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక 9 నెలలుగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. అనంతరం మండలంలోని ములగ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంట జరిగిన శుభకార్యాలలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, సీనియర్ నాయకుడు, ఆత్మ మాజీ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, భీమవరపు ప్రసాద్, బంకపల్లి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం ఎం.శంకరరావు

సీతానగరం: మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచిమార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీపీ బి.రామలక్ష్మి, స్థానిక సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాలలో పదోతరగతి అభ్యసించి త్వరలో పబ్లిక్ పరీక్షలు రాయనున్న వారికి మిగతా విద్యార్థులు హెచ్‌ఎం ఎం.శంకరరావు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థుల నుద్దేశించి ఆమె మాట్లాడుతూ త్వరలో టెన్త్ పబ్లిక్‌పరీక్షలు రాయనున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నత చదువులు అభ్యశించిన పాఠశాలకు కీర్తిప్రతిష్టలు తేవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులంతా సమాజానికి ఉపయోగపడే విద్యాధికులు కావాలని ఆకాంక్షించారు. సీనియర్(టెన్త్) విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు సభనిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమా భీమ లింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట



జలాభిషేకంచేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీసీహెచ్ అప్పలనాయుడు



దేవతామూర్తులకు తిరువీధి చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గ్రామస్థులు నిర్మించుకున్న రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం విఘ్నేశ్వరస్వామి పూజతో ప్రారంభమయ్యాయి. గ్రామస్తులంతా ఏకమై సమకూర్చుకున్న నిధులతో పాటు పలువురు ఇచ్చిన విరాళాలతో గ్రామంలోని కాలనీలో భీమలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం చేశారు. లాంఛనంగా గురువారం ప్రారంభించి శుక్రవారం వేకువజామున దేవతామూర్తుల ప్రతిమలతోపాటు త్రిశూలాన్ని భక్తులు సమకూర్చిన కలశాలతో ఊరేగింపుగా మేళతాళాలతో ఆలయ అర్చకులు ఆలయానికి చేర్చారు. ఈ మేరకు శుక్రవారం ఉత్సవ కమిటీ పిలుపు మేరకు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు స్వామివారిని దర్శించుకుని జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణకు శక్తి టీమ్‌లు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి
- శక్తి టీమ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ



జెండా ఊపి శక్తి పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ఐదుగురు సభ్యులతో మూడుబృందాలుగా పార్వతీపురం మన్యం జిల్లాలో 15మందితో శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు, చిన్నారులకు రక్షణగా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా జిల్లాలో శక్తి టీమ్స్‌ను నియమించామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో జిల్లా పోలీసు కార్యాలయంలో వారు నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలో శక్తి టీమ్స్ కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఫోర్‌వీలర్స్‌ను, పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభించారు. శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో యాప్‌ను నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా. ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు నాయుడు, రాంబాబు, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై సురేష్ , శక్తి టీమ్స్ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాతో నిఘా

పార్వతీపురం రూరల్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కట్టడి చేయాలనే ప్రత్యేక కార్యాచరణతో పార్వతీపురం మండలంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాలలో డ్రోన్ కెమెరా సాయంతో నిఘా ఏర్పాటు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే వారితో పాటు బహిరంగ ప్రదేశాల్లో జూదమాడేవారు, మద్యం, గంజాయి పీల్చే వ్యక్తులపై డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్సైతో పాటు డ్రోన్ కెమెరా ఆపరేటర్ సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో హెల్త్ అసిస్టెంట్ మృతి



చీకటి కన్నం నాయుడు (ఫైల్)

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చీకటి కన్నం నాయుడు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం తన స్వగృహంలో మృతి చెందాడు. కన్నం నాయుడికి ఇటీవల ఉద్యోగం రెగ్యులర్ అయింది. ఇంతలోనే అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆయన మృతి పట్ల పార్వతీపురం మన్యం జిల్లా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు గంట కిశోర్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.



మన ఊరు బడిని రక్షించుకుందాం పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఊరుబడి కోసం పోరాటం

పార్వతీపురంటౌన్: ఊరు బడిని రక్షించుకోవడానికి తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి, రాష్ట్ర కార్యదర్శి ఆర్. మోహనరావు, ఎస్.మురళీమోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఏర్పాటు కోసం, మిగిలిన ప్రాథమిక పాఠశాలలను, యూపీ స్కూల్స్‌ను రద్దు చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఊరుబడిని రక్షించుకోవడానికి, గ్రామస్తులు, తల్లిదండ్రులు, యువకులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈనెల 25న మంగళవారం సాయంత్రం 4గంటలకు పార్వతీపురం మన్యం కలెక్టరేట్ వద్ద తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం మన ఊరు బడిని రక్షించుకుందాం అనే పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, టి.రమేష్, కె.భాస్కరరావు, అధ్యక్షుడు ఎ. భాస్కరరావు, కార్యదర్శులు ఎం.పైడిపిరాజు, శ్రీను, రామకృష్ణ, శంకరరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరద గణపతి పూర్ణకలశ ప్రతిష్ట



చెముడులో ప్రతిష్ఠించిన లక్ష్మీ సరస్వతి సహిత వరద గణపతి దేవాలయం



పూజలో పాల్గొన్న భక్తులు



కలశాలతో మహిళల తిరువీధి

- కలశాలతో మహిళల తిరువీధి
- ఆకట్టుకున్న కోలాటం

మక్కువ: మండలంలోని చెముడు గ్రామంలో లక్ష్మీ సరస్వతి సహిత వరద గణపతి దేవాలయం పూర్ణకలశ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, యాగశాల, నవగ్రహపూజ, ఆలయ పూర్ణకలశ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో దేవతామూర్తుల విగ్రహాలను అన్ని పురవీధుల్లో ఊరేగించి కార్యక్రమం నిర్వహించగా, మహిళలు కలశాలతో తిరువీధిలో పాల్గొన్నారు. అలాగే మహిళలు నిర్వహించిన కోలాటం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

సాత్వికాహారంతో సత్ఫలితం

- నూనె పదార్థాలతో అతి దాహం
- చికెన్, మటన్‌లకు దూరంగా ఉంటేనే మేలు





రకరకాల పళ్లు, (ఇన్‌సెట్లోజ) కూరగాయిలు

బలిజిపేట: పరీక్షా సమయంలో విద్యార్థులకు మంచి సాత్వికాహారం ఎంతో ఉపయోగపడుతుంది. తల్లిదండ్రులు పిల్లల ఆహారం విషయంలో ఎంతో జాగ్రత్తలు తీసుకుంటారు. పరీక్షల సమయంలో మరింత జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. పదో తరగతి విద్యార్థులు ప్రిపరేషన్‌లో నిమగ్నమై ఉన్నారు. ఉత్తమ మార్కులు రావాలని ఆహారం, నిద్రను కొందరు నిర్లక్ష్యం చేస్తుంటారు. చదువు ధ్యాసలో పడి విద్యార్థులు కూడా సరిగ్గా తిండి తినకపోతే నీరసించి పరీక్షలు రాయలేక, పరీక్షల సమయంలో అనారోగ్యానికి గురవుతుంటారు. అందువల్ల తల్లిదండ్రులే విద్యార్థుల ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

టిఫిన్‌గా నూనె పదార్థాలు ఇవ్వరాదు

ఉదయం తీసుకునే అల్పాహారంలో నూనె వస్తువులు లేకుండా చూసుకోవాలి. ఆయిల్ ఫుడ్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవడం వల్ల తరచూ దాహం వేస్తుంది. దీంతో పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడతారు. తప్పనిసరిగా అల్పాహారం తీసుకోవాలి. సులువుగా అరిగిపోయే ఆహార పదార్థాలను టిఫిన్‌గా తీసుకుంటేనే మేలు. మిక్స్‌డ్ విజిటబుల్ కిచిడీ, గోధుమ రవ్వ ఉప్మా, ఇడ్లీ కూడా బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవచ్చు.

జ్ఞాపకశక్తి కోసం బి–12 విటమిన్

విద్యార్థులు చదివింది గుర్తుపెట్టుకోవటానికి విటమిన్–బి12 ఉపయోగపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుదలకు ఉపయోగపడే ఈ విటమిన్ మాంసపు ఉత్పత్తుల్లో అధికంగా లభిస్తుంది. మాంసం తనడానికి ఇష్టపడని వారు రోజుకు రెండు ఉడికించిన గుడ్లు తినడం మంచిది. మధ్యాహ్నం భోజనంలో ఒక ఆకుకూర తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. కూరగాయలతో చేసిన కూర, పెరుగు లేదా మజ్జిగ తీసుకోవాలి. భోజనం తరువాత ఏదైనా ఒక పండు తింటే మంచిది.

రాత్రి 8గంటల లోపు భోజనం ముగించాలి

రాత్రి భోజనం 8గంటల లోపు ముగిస్తే చాలా మంచిది. పప్పు కూర, రసం, సాంబారు, పెరుగు, మజ్జిగ ఉండేలా చూసుకోవాలి. నిద్రకు గంట ముందుగా గ్లాసు పాలు తాగడం ఉత్తమం. రాత్రిళ్లు ఎక్కువ సమయం వేచి ఉండవద్దు. సరిపడా కంటికి నిద్ర లేకపోతే అనేక అనర్థాలు తలెత్తుతాయి. కనీసం ఏడు గంటలు నిద్రపోవడం మంచిది. సీజన్‌లో లభించే పండ్లు, ముఖ్యంగా విటమిన్ సి ఎక్కువగా లభించేవి తీసుకోవడం మంచిది.

సాత్వికాహారం మంచిది

పదవ తరగతి విద్యార్థులు పరీక్షా సమయంలో తినే ఆహారం సాత్వికాహారం అయితే మంచిది. ఎండల ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల నూనెలతో తయారుచేసిన ఆహారంతో దాహం ఎక్కువగా ఉంటుంది, త్వరగా అరుగుదల కాదు. ఇబ్బందులు పడతారు. చికెన్, మటన్ వంటి వాటిని తగ్గించాలి. గ్లూకోజ్ ఎక్కువగా తీసుకుంటే మేలు.

క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పార్వతీపురం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం కార్మికులు నిరసన తెలియజేశారు. కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య పనుల్లో పాల్గొనే ముందు సాలూరు కార్మికులకు మద్దతుగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సింహాచలం, ఎస్. శంకరరావులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని పాలకులు పట్టించుకోకపోవడం హేయమైన చర్య అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోతే వారు కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. గంగునాయుడు, సీఐటీయూ నాయకులు జీవీ రమణ, ఆర్.వేణు, బి.సూరిబాబుతోపాటు పలువురు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి



స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

విశాఖలోని స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జి.వెంకటరమణ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. స్టీల్ ప్లాంట్ వల్ల 2లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగిస్తే సహించేదిలేదు



స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కార్మికులను పనుల్లోకి తీసుకోవాలంటున్న ఏఐటీయూసీ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్

స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే సహించేది లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో హమాలీలతో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన 248మంది కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఉక్కు యాజమాన్యాన్ని రీజనల్ లేబర్ కమిషనర్ ఆదేశించారన్నారు. ఏ ఒక్క కార్మికుడిని తొలగించినా ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆర్. దుర్గాప్రసాద్, పకీరు, రాము, తదితరులున్నారు.